క్లుప్తంగా

29న మహా ధర్మయుద్ధ మహాసభ

నేరేడుచర్ల : నల్లగొండ పట్టణంలో ఈనెల 29న నిర్వహించే మహా ధర్మయుద్ధ మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్‌ మండల అధ్యక్షుడు అరుణ్‌కుమార్‌ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రిజర్వేషన్ల వర్గీకరణకు సుప్రీం కోర్టు అనుకూలంగా తీర్పు అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాటను విస్మరించి మాదిగలకు తీవ్రమైన అన్యాయం చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వ వైఖరీని నిరసిస్తూ నల్లగొండలో మహాసభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహాసభకు ఎమ్మార్పీఎస్‌ కార్యకర్తలు, నాయకులు, అనుబంధ సంఘాలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు.

సిరిపురంలో డీజే నిషేధానికి తీర్మానం


సమావేశంలో పాల్గొన్న ఎస్‌ఐ అజయ్‌కుమార్‌, గ్రామపెద్దలు

నడిగూడెం : మండలంలోని సిరిపురం గ్రామంలో ఆదివారం గ్రామస్తులు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రామంలో ఇక నుంచి డీజే నిషేధించాలని తీర్మానించారు. ఇటీవల గ్రామానికి చెందిన గేసగాని సతీష్‌(26) గ్రామంలో ఓ పెళ్లి వేడుకలో డీజేతో ఊరేగింపులో పాల్గొని ఇంటికెళ్లి గుండెపోటుతో మృతి చెందాడు. దీంతో గ్రామపెద్దలు గ్రామంలో డీజే ఉపయోగించొద్దని తీర్మానం చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐ జి.అజయ్‌కుమార్‌, గ్రామపెద్దలు వెంపటి రామారావు, కాసాని వెంకటేశ్వర్లు, మొక్క భిక్షపతి, కస్తూరి లక్ష్మయ్య, వాసికర్ల శేషుకుమార్‌, మొక్క రామయ్య, కాంపాటి శివాజీ పాల్గొన్నారు.

పెండింగ్‌ డీఏలను వెంటనే విడుదల చేయాలి

చిలుకూరు : ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన మొత్తం 5 డీఏలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బంధం వెంకటేశ్వర్లు డిమాండ్‌ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం 5డీఏలు ఇస్తామని చెప్పి దీపావళి కానుకగా ఒక్క డీఏ ఇచ్చి మిగిలినవి తర్వాత ఇస్తామని చెప్పడం నిరాశను గురిచేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయ, ఉద్యోగులను ప్రభుత్వం విస్మరించడం తగదన్నారు. పెండింగ్‌లో ఉన్న అన్ని డీఏలను విడుదల చేయాలని డిమాండ్‌ చేశారు. అలాగే 317 జీఓ బాధితులకు న్యాయం చేయాలని కోరారు.

సదస్సును జయప్రదం చేయాలి


మాట్లాడుతున్న ధనుంజయనాయుడు

మఠంపల్లి : హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్‌ ప్రెస్‌క్లబ్‌లో ఈనెల 28న జరగనున్న బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దూళిపాల ధనుంజయనాయుడు కోరారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వాతంత్య్రం వచ్చిన 77ఏళ్ల తర్వాత కూడా బీసీలు రాజకీయ వివక్షతకు గురవుతున్నారని అన్నారు. బీసీల మధ్య ఐక్యత లేకపోవడమే ఇందుకు కారణమన్నారు. జాతీయ స్థాయిలో బీసీ సబ్‌ప్లాన్‌ ఏర్పాటు చేయాలన్నారు. అందుకు రూ.2లక్షల కోట్ల నిధులు కేటాయించాలన్నారు. బీసీల హక్కుల సాధనకు జరిగే ఈ సదస్సును జయప్రదం చేయాలన్నారు. సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి అమరారపు పున్నయ్య, బీసీ సంఘం నాయకులు ముత్యాల భాస్కర్‌, వడ్డేగాని లింగయ్య, తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత


ఆర్థికసాయం అందజేస్తున్న లారీ డ్రైవర్స్‌ అసోసియేషన్‌ సభ్యులు

నడిగూడెం : మండల కేంద్రానికి చెందిన లారీడ్రైవర్‌ దాసరి నాగార్జున(28) ఇటీవల మృతి చెందాడు. ఆదివారం నాగార్జున కుటుంబానికి నడిగూడెం లారీ డ్రైవర్స్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో రూ.24వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో షరీఫ్‌, జానిమియా, నాగేశ్వరరావు, గౌస్‌, సైదులు, సమద్‌, సతీష్‌, సుభాని, నవీన్‌, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో వసతులు కరువు

- శిథిలావస్థలో ప్రభుత్వ పాఠశాల భవనాలు
- ఒకగదిలో రెండు తరగతుల విద్యార్థులకు బోధన
- తాగునీరు, మరుగుదొడ్లు లేక విద్యార్థుల ఇబ్బందులు


చింతలపాలెంలో శిథిలావస్థలో ఉన్న ప్రాథమిక పాఠశాల భవనం


కూలేందుకు సిద్ధంగా ఉన్న పాఠశాల భవనం పైకప్పు

హుజూర్‌నగర్‌ (చింతలపాలెం) : కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను నడపాలనే ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతుంది. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు సరైన వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడాల్సివస్తుంది. దీంతో పాఠశాలల్లో చేరేందుకు విద్యార్థులు ముందుకురావడంలేదు. ప్రస్తుత పరిస్థితుల్లో కూడా ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులు ఇరుకు గదుల్లో చదువుకోవాల్సిన దుస్థితి నెలకొంటుంది. చింతలపాలెం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో 5తరగతులు, 4గురు ఉపాధ్యాయులు, 41మంది విద్యార్థులు ఉన్నారు. కాని పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టుగా సరిపడా తరగతి గదులు లేవు. దాదాపు 50ఏళ్ల క్రితం ఈ పాఠశాలను 3గదులతో నిర్మించారు. అనంతరం 2000 సంవత్సరంలో ఒక అదనపు తరగతి గదిని, ఆ తర్వాత మరొక అదనపు తరగతి గదిని నిర్మించారు. అయితే పూర్వం నిర్మించిన పురాతన 3భవనాలు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుని కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. దీంతో గతంలోనే పరిశీలించిన ఇంజనీరింగ్‌ అధికారులు కూల్చివేయాలని కూడా వెల్లడించారు. అయినా ఆ భవనాలను కూల్చకుండా అలాగే ఉంచారు. ప్రస్తుతం పాఠశాలలో ఒక గదిని హెచ్‌ఎం కార్యాలయం, రికార్డు రూం, తదితర అవసరాల కోసం వినియోగిస్తున్నారు. కాగా ప్రస్తుతం 5తరగతుల విద్యార్థులకు రెండు గదులు మాత్రమే ఉన్నాయి. ఇవి విద్యాబోధనకు ఏమాత్రం సరిపోవడం లేదు.

ఒకే గదిలోనే రెండు తరగతుల నిర్వహణ..

పాఠశాలలో సరిపడా భవనాలు లేక ఉపాధ్యాయులు చేసేది లేక ఒకే గదిలోనే రెండు తరగతుల విద్యార్థులను కూర్చోబెట్టి చదువులు చెప్పాల్సివస్తోంది. దీంతో విద్యార్థులు చదువుపై దృష్టి కేంద్రీకరించలేకపోతున్నారు. ఇదిలా ఉండగా పాఠశాలకు ప్రహరీ కూడా లేదు. దీంతో జంతువులు పాఠశాల ఆవరణలో ఎల్లప్పుడు సంచరిస్తున్నాయి. అదే విధంగా రాత్రి సమయంలో మందుబాబులకు పాఠశాల అడ్డాగా మారుతుంది. అంతే కాకుండా పాఠశాలలో తాగునీటి వసతి, మరుగుదొడ్ల సౌకర్యం లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ పాఠశాలను అధికారులు గత ప్రభుత్వ హయాంలో మన ఊరు మనబడి పథకంలో ఎంపిక చేశారు. పాఠశాలకు మూడు గదులు మంజూరు కాగా సంబంధిత కాంట్రాక్టర్‌ నిర్లక్ష్యంతో గదులు నిర్మించకపోవడంతో ఈ నిధులు వెనక్కు వెళ్లాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలలో నూతన తరగతి గదులు, ప్రహరీ, బోరు, మరుగుదొడ్లు నిర్మాణానికి నిధులు మంజూరు చేసి సమస్యను పరిష్కరించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, గ్రామస్తులు కోరుతున్నారు.

నూతన భవనాలు నిర్మించాలి



ఒకే గదిలో రెండు తరగతుల విద్యార్థులం కూర్చుని చదువుకోవడంతో శ్రద్ధ ఉండడం లేదు. సార్లు చెప్పేది కూడా మాకు సరిగా అర్థం కావడం లేదు. దీంతో మేం ఇంటికి వెళ్లినా చదువులేకపోతున్నాం. మాకు పాఠశాలలో కొత్తగా తరగతి గదులు నిర్మించాలి. అధికారులు మా ఇబ్బందులను తొలగించాలి.

– సీహెచ్‌ అఖిల, 4వ తరగతి, చింతలపాలెం

ఒక గదిలోనే బోధన చేయాల్సివస్తుంది



పాఠశాలలో తరగతి గదులు సరిపడా లేక ఒక గదిలోనే రెండు, మూడు తరగతుల విద్యార్థులకు బోధన చేయాల్సివస్తుంది. దీంతో విద్యార్థులు చదువులపై దృష్టి కేంద్రీకరించలేకపోతున్నారు. ఇది విద్యార్థిపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఈ విషయాన్ని పైఅధికారులకు కూడా తెలియజేశాం. జిల్లా అధికారులు సత్వరం స్పందించి తరగతి గదులు మంజూరు చేయించాలి.

– కె మధుసూధన్‌రెడ్డి, హెచ్‌ఎం, పీఎస్‌ చింతలపాలెం

కార్మికుల పక్షాన ఐఎన్‌టీయూసీ పోరాటం


ఐఎన్‌టీయూసీలోకి ఆహ్వానిస్తున్న యరగాని నాగన్న

హుజూర్‌నగర్‌ : కార్మికుల పక్షాన ఐఎన్‌టీయూసీ నిరంతరం పోరాటం చేస్తుందని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్నగౌడ్‌ అన్నారు. పట్టణంలోని సంఘం కార్యాలయంలో కాంగ్రెస్‌ నాయకుడు చిట్యాల అమర్నాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో వివిధ యూనియన్లకు చెందిన బిల్డింగ్‌ వర్కర్లు ఆదివారం ఐఎన్‌టీయూసీలో చేరారు. ఈ సందర్భంగా వారికి ఆయన సంఘం కండువాలను కప్పి యూనియన్‌లోకి ఆహ్వానించారు. అనంతరం నాగన్నగౌడ్‌ మాట్లాడారు. బిల్డింగ్‌ అండ్‌ అదర్‌ కన్‌స్ట్రక్షన్‌ బోర్డులో 2011నుంచి అమలవుతున్న అన్ని పథకాలను ఎలాంటి సవరణలు లేకుండా పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. అదేవిధంగా లేబర్‌ డిపార్ట్‌మెంట్‌ అధికారులు అలసత్వం లేకుండా ఆన్‌లైన్‌ సేవలను త్వరితగతిన వేగవంతం చేయాలని కోరారు. మంత్రి ఉత్తమ్‌ నియోజకవర్గంలోని కార్మికులు కర్షకులు, యువత కోసం నూతన ఇండ్ల నిర్మాణం, ఐటీఐ, స్కిల్‌ డెవలప్‌మెంట్‌ ఇనిస్టిట్యూట్లను ఏర్పాటు చేసి ఈ ప్రాంత నిరుద్యోగ యువతకు గొప్ప అవకాశాన్ని కల్పిస్తున్నారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు బెల్లంకొండ గురవయ్య, జిల్లా నాయకులు చింతకాయల రాము, అనీఫ్‌ తదితరులు పాల్గొన్నారు.

సీఎం ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న రాజన్న మాదిగ

కోదాడరూరల్‌ : ఎమ్మార్పీఎస్‌ వర్గీకరణపై కమిటీల పేరుతో కాలయాపన చేయకుండా మాదిగలకు ఇచ్చిన మాటను సీఎం రేవంత్‌రెడ్డి నిలబెట్టుకోవాలని ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్‌ జిల్లా అధ్యక్షుడు యాతాకుల రాజన్నమాదిగ, చింతా విజయ్‌బాబు మాదిగ అన్నారు. ఆదివారం పట్టణంలో నిర్వహించిన ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్‌ అనుబంధ సంఘాల నియోజకవర్గ స్థాయి సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. సుప్రీం కోర్టులో ఎస్సీ వర్గీకరణపై సానుకూల తీర్పురాగానే సీఎం రేవంత్‌రెడ్డి దేశంలోనే మొదటిగా తెలంగాణలోనే వర్గీకరణ చేపడతామని మాట ఇచ్చి నేడు వర్గీకరణ చేయకుండా ద్రోహం చేస్తున్నాడని విమర్శించారు. వర్గీకరణ చేయకుండా ఉద్యోగ భర్తీ చేయడం సరికాదన్నారు. మూడురోజుల్లో నల్లగొండలో జరిగే మాదిగ ధర్మయుద్ధ ఉమ్మడి జిల్లా సదస్సును విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్‌ నియోకవర్గ ఇన్‌చార్జ్‌ ఏపూరి రాజుమాదిగ, బొజ్జ సైదులుమాదిగ, వడ్డేపల్లి కోటేష్‌మాదిగ, కొత్తపల్లి అంజయ్యమాదిగ, సిద్దెల శ్రీను మాదిగ, ఏపూరి సత్యరాజుమాదిగ, బొడ్డు కుటుంబరావుమాదిగ, పాతకొట్ల నాగరాజు మాదిగ తదితరులు ఉన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం


విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొన్న మేడ్చల్‌ ఎస్పీ కోటిరెడ్డి దంపతులు

మునగాల : మండలంలోని మాధవరం గ్రామంలో ఆదివారం శ్రీశ్రీనాంచారమ్మ తల్లి, శ్రీపోతురాజుల విగ్రహప్రతిష్ఠామహోత్సవాన్ని ఏకలవ్య సంఘం కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ ఈ ఉత్సవాల్లో గ్రామానికి చెందిన మేడ్చల్‌ ఎస్పీ నంద్యాల కోటిరెడ్డి–కవిత దంపతులు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఇందులో భాగంగా గ్రామంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మూడు రోజులుగా కొనసాగుతున్న ఉత్సవాల సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో ఏకలవ్య సంఘం అధ్యక్షుడు కుంభం భిక్షం, ప్రధాన కార్యదర్శి కుంభం వీరకర్ణ, కమిటీ సభ్యులు కుంభం గోవింద్‌, కుంభం వెంకన్న, నల్లగొండ సాలయ్య, నల్లగొండ నాగమణి, పిచ్చమ్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఒకే కుటుంబలో ఇద్దరికి ఎంబీబీఎస్‌ సీట్లు


తల్లిదండ్రులతో ఉషశ్విని, తేజశ్విని

కోదాడరూరల్‌ : మండల పరిధిలోని కాపుగల్లు గ్రామంలో ఒకే ఇంట్లో ఇద్దరు అక్కాచెల్లెలుకు ఓపెన్‌ కేటగిరిలో ఎంబీబీఎస్‌ సీట్లు సాధించారు. గ్రామానికి చెందిన చలసాని జగన్‌–శ్రీలత దంపతుల పెద్ద కుమార్తె ఉషశ్విని 2022లో నీట్‌ పరీక్షలో ప్రతిభ చూపి జీఎంసీ మహబూబాబాద్‌లో సీటు సాధించి ఎంబీబీఎస్‌ విద్యను అభ్యసిస్తుంది. రెండో కుమార్తె తేజశ్విని 2024 నీట్‌ పరీక్షలో ప్రతిభ చూపి మంచిర్యాల మెడికల్‌ కళాశాలలో సీటు సాధించింది. ఎంబీబీఎస్‌ పూర్తి చేసి పీజీ సీటు సాధించి పేద ప్రజలకు వైద్యసేవ చేయడమే లక్ష్యమని వారు తెలిపారు. దీంతో వారిని గ్రామస్తులు, స్నేహితులు, అభినందించారు.

పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తే చర్యలు


ఆటోడ్రైవర్‌కు ఫైన్‌ విధిస్తున్న ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్‌

మునగాల : ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ బి.ప్రవీణ్‌కుమార్‌ హెచ్చరించారు. ఆదివారం మండలంలోని బరాఖత్‌గూడెం గ్రామపంచాయతీ పరిధిలోని శ్రీనివాసనగర్‌ కాలనీ వద్ద ఆటోలను తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా పరిమితికి మించి ఆటోలలో ప్రయాణికులను తరలిస్తున్న తొమ్మిది ఆటోలపై చలానాలు విధించారు. అనంతరం ఎస్‌ఐ మాట్లాడుతూ.. ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తుండంతో ప్రమాదాలు సంభవించడంతో పలువురు మృత్యువాత పడడమే కాక తీవ్ర గాయాల పాలవుతున్నారని అన్నారు. నలుగురితో వెళ్లాల్సిన ఆటోలో 20మంది ప్రయాణికులను డ్రైవర్లు తరలిస్తున్నారని అన్నారు. ఈ నేపథ్యంలో ప్రమాదం జరిగిన సమయంలో పలువురు మృత్యువాతకు గురవుతున్నారని అన్నారు. ఆటోడ్రైవర్లు విధిగా ఆటోలకు సంబంధించిన అన్ని పత్రాలు కలిగి ఉండాలన్నారు. రానున్న దీపావళి పండుగ సందర్భంగా అనుమతి లేకుండా టపాసులు విక్రయించరాదని, పోలీసు శాఖ అనుమతి తప్పనిసరిగా ఉండాలని ఆయన సూచించారు.

మహాసమ్మేళనం కరపత్రాల ఆవిష్కరణ


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డీఎస్పీ నాయకులు

నాగారం : హైదరాబాద్‌లోని ఆదిబట్లలో ఈ నెల 3న జరిగే ధర్మ సమాజ్‌ పార్టీ కార్యకర్తల మహాసమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల కన్వీనర్‌ చిప్పలపల్లి నాగార్జున మహారాజ్‌ కోరారు. ఆదివారం మండల కేంద్రంలో ధర్మ సమాజ్‌ పార్టీ మహాసమ్మేళన కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. బీఆర్‌ఎస్‌, బీజేపీ, కాంగ్రెస్‌ ప్రభుత్వాలు ఏళ్ల తరబడి ఎస్సీ, ఎస్టీ, బీసీ ప్రజలను దోచుకున్నాయని, వారికి కనీసం విద్య, వైద్యం, ఉపాధి, భూమి, ఇళ్లు లేకుండా చేశాయని విమర్శించారు. బలహీన వర్గాల రాజ్యాధికారం కోసం డాక్టర్‌ విశారదన్‌ మహారాజ్‌ ఆధ్వర్యంలో ధర్మ సమాజ్‌ పార్టీ ఏర్పడిందన్నారు. నవంబర్‌ 3న జరిగే ధర్మ సమాజ్‌ పార్టీ మహాసమ్మేళనానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజలు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ జిల్లా కోశాధికారి గైగుల్లా నిరంజన్‌, పేరాల శ్రీనివాస్‌, పృథ్వీ, పేరాల పెద్ద శ్రీనివాస్‌, వినయ్‌, ఉపేందర్‌, అర్జున్‌ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి భూమి కేటాయించాలి

తుంగతుర్తి : గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో మంజూరైన సంతు సేవాలాల్‌ మహారాజ్‌ భవనానికి ప్రభుత్వం భూమి కేటాయించాలని బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య డిమాండ్‌ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని మెయిన్‌ రోడ్డుపై బీఆర్‌ఎస్‌ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌, గిరిజన నాయకులు నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. గతంలో ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్‌ ప్రతిపాదనలతో గిరిజన భవన నిర్మాణానికి రూ.2 కోట్ల 50 లక్షలు కేటాయించడంతోపాటు టెండర్‌ ప్రక్రియ పూర్తిచేసినట్లు తెలిపారు. కానీ నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్‌ ప్రభుత్వం స్థల నిర్ధారణ చేయకపోవడం వల్ల పది నెలలుగా నిర్మాణ పనులు ప్రారంభం కాలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకొని రెవెన్యూ అధికారులకు ఆదేశాలు ఇచ్చి ప్రభుత్వ భూమిని కేటాయించాలని కోరారు. వెంటనే భవన నిర్మాణ పనులు చేపట్టే విధంగా చర్యలు చేపట్టాలన్నారు.

సైబర్‌ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

నడిగూడెం : సైబర్‌ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ జి.అజయ్‌కుమార్‌ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని సిరిపురంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో సైబర్‌ నేరాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆన్‌లైన్‌ వ్యాపారాలు చేసి, మోసపోవద్దని, గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్‌ చేసి ఓటీపీ అడిగితే చెప్పొద్దని సూచించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


కోదాడరూరల్‌ : సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు


నేరేడుచర్ల : క్రాంతిస్కూల్‌లో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

కోదాడరూరల్‌ : పట్టణంలోని వివేకానంద పాఠశాలలో 1998–99 విద్యా సంవత్సరంలో 10వతరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం స్థానికంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమంలో చిన్ననాటి స్నేహితులందరు హాజరై ఒకరికొకరు యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా నాటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సయ్యద్‌బాబా, శివ, రాము, అనిల్‌, విష్ణు, శైలజ, దివ్య, లావణ్య, పద్మ, కావ్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

పాలకవీడు : మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2005–06 సంవత్సరంలో పదోతరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక పాఠశాలలో కలుసుకుని గత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం ఆనాటి ఉపాధ్యాయులను శాలువాలు కప్పి సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఆటపాటలతో ఉత్సాహంగా సందడి చేశారు. జీవితంలో ఎవరెవరు ఎక్కడెక్కడ స్థిరపడ్డారో పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమాదేవి, శ్రీను, జగన్నాధరావు, పూర్వ విద్యార్థులు హరిత, శ్రవంతి, ఉమాదేవి, లలిత, శ్రీలత, కృష్ణవేణి, నాగరాజు, ఈశ్వర్‌, ఫయాజ్‌, క్రాంతికుమార్‌, సుందరయ్య తదితరులు పాల్గొన్నారు.

నేరేడుచర్ల: మండలంలోని దిర్శించర్ల జెడ్పీహెచ్‌ఎస్‌లో 1983–84 విద్యా సంవత్సరంలో పదోతరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్నారు. చిన్ననాటి మధుర స్మృతులను గుర్తుచేసుకుని ఆనందంగా గడిపారు. తమకు చదువు చెప్పిన గురువులు యంబయ్యచారి, సోమయ్య, మున్వర్‌ బేగంను సత్కరించారు. ఈ సందర్భంగా పాఠశాలకు పేరు బోర్డును బహూకరించడంతో పాటు 10వ తరగతిలో ప్రథమ స్థానం సాధించిన వారికి రూ.1500, ద్వితీయ స్థానం సాధించిన వారికి రూ.1000 అందిస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఓరుగంటి మురళి, బాబా, వెంకట్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, కోటేశ్వర్‌రావు, భాస్కర్‌, సీతారాంరెడ్డి, సైదులు, జానయ్య, జానకమ్మ, జయమ్మ, లక్ష్మమ్మ ఉన్నారు.

నేరేడుచర్లలోని క్రాంతి స్కూల్‌లో ..

మండల కేంద్రంలోని క్రాంతి పబ్లిక్‌స్కూల్‌లో 2000–2001 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలనాటి మధుర స్మృతులను గుర్తు చేసుకుంటూ ఆప్యాయంగా పలకరించుకున్నారు. అనంతరం నాటి గురువులు సత్యనారాయణ, శ్రీనివాస్‌, నర్సింహారావు, వాసుదేవమూర్తి, మోహన్‌రావులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు జనార్దన్‌, ఈశ్వర్‌, ఉపేందర్‌, రవి, నవీన్‌, రవికుమార్‌రెడ్డి, అనిల్‌రెడ్డి తదితరులున్నారు.


పాలకవీడు : సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు


నేరేడుచర్ల : దిర్శించర్ల జెడ్పీహెచ్‌ఎస్‌ 1983-84 బ్యాచ్‌ విద్యార్థులు

అధ్వానంగా గ్రామీణ లింక్‌రోడ్లు

- గుంతలమయంగా చిలుకూరు నుంచి కొత్తకొండాపురం, ఆర్లెగూడెం రోడ్డు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు, వాహనదారులు
- మరమ్మతులు చేయించాలని వేడుకోలు


చిలుకూరు చెరువు సమీపంలో రాళ్లు తేలి అధ్వానంగా ఉన్న రోడ్డు


కొత్త కొండాపురం గ్రామ శివారులో అధ్వానంగా లింక్‌రోడ్డు

చిలుకూరు : మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే లింక్‌రోడ్లు అధ్వానంగా మారాయి. ఏళ్ల తరబడి ఆ రోడ్లకు ఎటువంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో ఆ రోడ్లలో ప్రయాణాలు సాగించాలంటే ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిలుకూరు మండల కేంద్రం నుంచి ఆర్లెగూడెం, కొత్తకొండాపురం వరకు వెళ్లే రోడ్డు గుంతలమయంగా తయారైంది. సుమారుగా 5కిలోమీటర్లు మేర ఉన్న ఈ రోడ్డు పొడవున గుంతలు, రాళ్లుతేలి చెట్లతో మూసుకుపోయి ప్రమాదకరంగా మారింది. దీంతో ఈ రోడ్డులో ప్రయాణం అంటేనే ప్రయాణికులు జంకుతున్నారు. అదే విధంగా ఈ రోడ్డు ఇరుపక్కలా ఆక్రమణలకు గురికావడంతో వెడల్పు తక్కువగా ఉండి ఎదురుఎదురుగా రెండు వాహనాలు వస్తే కనీసం పక్కకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఈ రోడ్డులో మండల కేంద్రం చిలుకూరు నుంచి ఆర్లెగూడెం, కొత్త కొండాపురం మీదిగా ముక్యాల బ్రాంచ్‌ కెనాల్‌ మీదుగా పాత కొండాపురం, మాధవగూడెం నుంచి విజయవాడ– హైదరాబాద్‌ జాతీయ రహదారికి వెళ్లేందుకు వీలుంటుంది. రోడ్డుకు మరమ్మతులు చేపడితే జాతీయ రహదారిపైకి వెళ్లడానికి సులభమైన మార్గం కానుంది.

ఇబ్బందులు పడుతున్న రైతులు..

ఈ రోడ్డులో చిలుకూరు, ఆర్లెగూడెం, పాత కొండాపురం గ్రామాలకు చెందిన రైతుల పొలాలు ఉంటాయి. నిత్యం ఇక్కడి నుంచి వందల మంది రైతులు తమ పొలాలకు వెళ్తుంటారు. రోడ్డు అధ్వానంగా ఉండడంతో తమ పొలాలకు అవసరాల నిమిత్తం మందు కట్టలు తీసుకొని పోవడానికి, గడ్డి తీసుకొని రావడానికి ద్విచక్రవాహనంపై వెళ్లాలన్నా వెళ్ల లేని పరిస్థితి నెలకొంది. వరినాట్లు, వరికోతల సమయంలో ట్రాక్టర్లు, వరికోత మిషన్లు పోవాలంటే మరింత ఇబ్బందిగా ఉంటుందని రైతులు వాపోతున్నారు. ఈ రోడ్డు మరమ్మతులు చేపట్టాలని పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా నేటి వరకు సమస్య పరిష్కారం కాలేదని రైతులు పేర్కొన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఈ రోడ్డుకు మరమ్మతులు చేయించాలని పలువురు రైతులు కోరుతున్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేయించాలి



చిలుకూరు నుంచి పాతకొండాపురం, ఆర్లెగూడెం వరకు వెళ్లే రోడ్డు మొత్తం ధ్వంసమైంది. ఈ రోడ్డులో ప్రయాణం చేయాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నాము. ఈ రోడ్డుకు మరమ్మతులు చేయించాలని పలువురు అధికారులకు, నాయకులకు విన్నవించినా ప్రయోజనం లేదు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణమే రోడ్డుకు మరమ్మతులు చేయించాలి.

– పిల్లుట్ల రమేష్‌, రైతు, చిలుకూరు